సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



గంభీరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



మారికవలసలోని శిబిరంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద వివరాలు నమోదు చేయించుకుంటున్న రోగులు

ఆనందపురం : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, మళ్లీ ఆయనను ప్రజలు ఆశీర్వదించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గంభీరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో బడాబాబులకే మేలు జరిగిందని, బడుగు బలహీన వర్గాలను పట్టించుకోలేదన్నారు. అట్టడుగున ఉన్న అలాంటి వారి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలకు శ్రీకారం చుట్టారని వివరించారు. ఇంటింటికీ తిరిగి అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం దేశ చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. పేద ప్రజల ఆరోగ్యంపై సీఎం ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతోందన్నారు. గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. గంభీరం పంచాయతీలో సంక్షేమం, అభివృద్ధి పనులకు రూ.13 కోట్లు వెచ్చించామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అన్నీ ఉచితమేనని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, అధికారులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పద్మావతి, ఎంపీడీవో అడపా లవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీలు బొట్టా ధనలక్ష్మి, పాండ్రంకి శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు బొట్ట రామకృష్ణ, ఉప్పాడ సూరిబాబు, బోయి వెంకటరమణ, ఇలిపిల్లి నరిసింగరావు, కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.



విజయానందపురంలో వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి



గంభీరంలో అంగన్‌వాడీ పౌష్టికాహారం స్టాల్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విజయానందపురంలో..

పద్మనాభం: పేదలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటికి సమీపంలోనే ఉచిత వైద్యం అందుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ విజయానందపుంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. చంద్రబాబు డబ్బున్న వారి సంక్షేమం మాత్రమే కోరే వారని.. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోరే వ్యక్తి అని అన్నారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలని తలపెడితే, నేరేళ్లవలసకు చెందిన కొంతమంది అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. నేరేళ్లవలస సచివాలయాన్ని నిర్మించకుండా కోర్టుకెళ్లి అడ్డుకున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం శిబిరానికి హాజరైన వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సారిక శంకరరావు, రేవళ్ల సూరిబాబు, బోని సన్యాసినాయుడు, మొకర అప్పలనాయుడు, సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరావు, గాడు అప్పలరాజు పాల్గొన్నారు.



మారికవలస యూపీహెచ్‌సీ వద్ద శిబిరంలో మహిళకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే

పేదల ఇంటి వద్దకే వైద్యం

మధురవాడ: దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజల ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీ యూపీహెచ్‌సీ వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఇక్కడ సేవలు అందిస్తున్న స్పెషలిస్టులు, ఇతర వైద్యులు హరితకుమారి, ఆయుషా, పి.విశ్వభారతి, సిందూషి, చైతన్య, పూజ తదితరులను సత్కరించారు. ప్రాణదాతలంటూ వారి సేవలను కొనియాడారు.

ఎంతమంది కలసి వచ్చినా వైఎస్సార్‌సీపీదే అధికారం

మంచి జరిగిందని విశ్వసిస్తేనే తనకు ఓటు వెయ్యాలని చెప్పే ధైర్యం ఉన్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు. ఎంతమంది కలసి వచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం అన్నారు. అబద్దాలు, వెన్నుపోటు, మోసాలకు పాల్పడిన నాయకుడు చంద్రబాబు అని.. నిజాయితీ, చెప్పిన మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పోలిరెడ్డి, గాదే రోశిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్‌కుమార్, కుడితి రామారావు, జేఎస్ రెడ్డి, బండారు శివలక్ష్మి, చేకూరి రజని, ప్రసాద్, రుషికేష్, గాయత్రి, సీత తదితరులు పాల్గొన్నారు.

తొట్లకొండను సందర్శించిన స్వామీజీ



తొట్లకొండపై యోగి ప్రభాకర్ స్వామీజీ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో తొట్లకొండను యోగి ప్రభాకర స్వామీజీ బుధవారం సందర్శించారు. జోడుగుళ్లపాలెంలోని ఆశ్రమం నుంచి వచ్చిన స్వామీజీ ముందుగా ఇక్కడి మహా బౌద్ధ స్థూపం, చైత్యాలు, వంట గదులు, నీటి తొట్టిలు, సమావేశ మందిరాలను సందర్శించారు. అనంతరం కొండపై కాసేపు ధ్యానం చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ చంద్రమౌళి

తగరపువలస: ఈ నెల 10న అనకాపల్లి జిల్లా సబ్బవరంలో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో చిట్టివలసకు చెందిన విజ్‌డమ్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులు బి.సుఖేష్, కె.యశ్వంత్ ఎంపికయ్యారు. త్వరలో గుంటూరులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.అనుపమ జ్యోతిర్మయి, చైర్మన్ ఎస్.ఎ.చంద్రమౌళి, ప్రిన్సిపాల్ ఆర్.వి.ప్రసాద్, పీడీ లక్ష్మణరావు, ఇతర అధ్యాపకులు వీరిని అభినందించారు.

క్లుప్తంగా

అధ్యాపకుడు కీర్తి కిరణ్‌కు డాక్టరేట్



ఉయ్యూరు కీర్తి కిరణ్

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన సహ అధ్యాపకుడు ఉయ్యూరు కీర్తి కిరణ్‌కు ఒడిశాలోని గుణుపూర్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. 'వెహికల్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్'అనే అంశంపై ఆ వర్సిటీకి చెందిన ప్రియదర్శిన్ పరిడా, చండీఘడ్ విశ్వవిద్యాలయానికి చెందిన సోనాలీదాస్‌ల పర్యవేక్షణలో కిరణ్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయనను రఘు విద్యా సంస్థల సిబ్బంది, ఉద్యోగులు అభినందించారు.

పాఠశాలలకు వంట పాత్రలు



దువ్వుపేట ప్రాథమిక పాఠశాలలో వంట పాత్రలు

పద్మనాభం: మండలంలోని 60 పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేసింది. 49 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఈ పాత్రలను అందజేశారు. వీటిని మండల విద్యా శాఖ కార్యాలయం నుంచి పాఠశాలలకు వ్యాన్ ద్వారా తరలిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు ఈ పాత్రలు చేరాయి.

అగ్నిప్రమాద బాధితులకు సాయం




బాధితులకు సాయం అందిస్తున్న సతీష్, మంగరాజు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో ఈ నెల 5వ తేదీన అగ్ని ప్రమాదం సంభవించి ఇళ్లు కాలిపోయిన రెండు కుటుంబాలకు బుధవారం వాండ్రాసి సతీష్‌కుమార్, బాయిన మంగరాజు తదితరులు సాయం అందించారు. బాధితులు కాకర మంగ, వానపల్లి సూరిబాబు కుటుంబాలకు శివశంకర్ అనే మిత్రుని సహకారంతో నిత్యావసర సరకులు, నగదు సాయం అందించారు.

అనిట్స్‌లో నేటి నుంచి ఐఈఈఈ లీడర్‌షిప్ సమ్మిట్

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ఐఈఈఈ ఎడ్యుకేషన్ సొసైటీ లీడర్‌షిప్ సమ్మిట్–2023 జరగనుంది. ఈ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో శాస్త్రవేత్త, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుఘేష్, ఇతర ప్రముఖులు హాజరు కానున్నారు. అనుభవజ్ఞులు ఐఈఈఈ ఎడ్యుకేషన్ సొసైటీ , నూతన సాంకేతిక అంశాలను బోధనతో పాటు వర్క్‌షాపు, ఇండస్ట్రియల్ విజిట్ ఇందులో ఉంటాయని ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, ట్రిపుల్ ఈ విభాగాధిపతి జె.వి జయకుమార్ బుధవారం తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సంతపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు సంతపేటలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఈ నెల 30న సంతపేట చిల్డ్రన్స్ పార్కులో జరగనున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య సిబ్బంది, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. నాయకులు చేట్ల ఎల్లయ్యరెడ్డి, వంశీ, జగన్నాథ ఎల్లాజీ, ఉప్పాడ అప్పలరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పాత మూలకుద్దులో ఉత్సవరాట వేస్తున్న గ్రామస్తులు

మధురవాడ: చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనునాయి. ఈ మేరకు పోస్టర్, కరపత్రాలను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం విశాఖలోని తన నివాసంలో ఆవిష్కరించారు. 9 రోజుల పాటు 9 రకాల అవతారాలలో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 24వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ ప్రతినిధి పిళ్లా సూరిబాబు, అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, పట్నాల మూర్తిశర్మ, గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, జగ్గుపిల్లి నాని పాల్గొన్నారు.

పందిరి రాట

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దు గ్రామంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు స్థానికులు బుధవారం పందిరి రాట వేశారు. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పీఎం పాలెం: ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీశృంగేరీ శంకర మఠంలో గౌరవ పరిపాలన అధికారి జగర్లపుడి వెంకటేశ్వర్లు తెలిపారు. మఠంలో కొలువుదీరిన శారదాంబ,

సోఫా మరమ్మతుల షాపు దగ్ధం



సంతపేటలో దగ్ధమైన సోఫా రిపేర్ షాపు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేటలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సత్యశ్రీ సోఫా మరమ్మతుల షాపు దగ్ధమైంది. ఈ ఘటనలో సోఫాలు, మెటీరియల్, యంత్రాలు, ద్విచక్ర వాహనం, ఇతర గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితుడు భగీరథ విజయ వర్ధన్ కుమార్‌రాజు తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సోఫా రిపేర్ షాపును ఆనుకుని నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనానికి సంబంధించి వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. ఆ నిప్పురవ్వలు పడి అగ్నిప్రమాదానికి కారణమై ఉంటుదని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో షాపు యజమాని కుమార్‌రాజు భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స నిమిత్తం వెళ్లడంతో.. ప్రమాదం జరిగినా వెంటనే తెలిసే అవకాశం లేకపోయింది. చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునే సమయానికే మొత్తం కాలిపోయింది. విజయదశమికి డెలివరీ చేసేందుకు తయారు చేసిన సోఫాలు, మెటీరియల్ పెద్ద మొత్తంలో దగ్ధమయ్యాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం డొంకినవలసకు చెందిన కుమార్‌రాజు ఈ స్థలాన్ని అద్దెకు తీసుకుని సోఫా రిపేర్ షాపు నిర్వహిస్తున్నారు.

డిజిటల్ పరికరాలతో మెరుగైన బోధన



ఉపాధ్యాయులకు అవగాహన కలిగిస్తున్న గౌరీ శంకర్

ఆనందపురం: ప్రభుత్వం అందించిన డిజిటల్ పరికరాల ద్వారా విద్యాబోధనతో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా డిప్యూటీ డీఈవో ఎ.గౌరీ శంకర్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు డిజిటల్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ సాధారణ బోధనలో గల అవాంతరాలను అధిగమించి, మెరుగైన విద్యను అందించేందుకు సాంకేతిక పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తరగతి గదిలో డిజిటల్ పరికరాలను తప్పకుండా వినియోగించాలని కోరారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను వారు వినియోగించేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లా నోడల్ అధికారి సత్య మహేష్ మాట్లాడుతూ డిజిటల్ పరికరాలు వినియోగించే పద్ధతులు, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు ఎవరిని సంప్రదించాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, ఇతర పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 40 మంది ఎంపిక



ప్రాంగణ ఎంపికలకు హాజరైన అభ్యర్థులు

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ ఇంటర్వ్యూలకు 400 మంది అభ్యర్థులు హాజరు కాగా జెన్‌పాక్ట్, ఏరియస్, ఏక్సెంట్యూర్, టెక్ మహీంద్రా, వరుణ్ మోటార్స్, కన్సెంట్రిక్స్ తదితర సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన హెచ్‌ఆర్‌లు వివిధ దశల్లో పరీక్షలు నిర్వహించి, కొద్దిమందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులను కళాశాల చైర్మన్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ జరజాపు సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కొయ్య చిట్టిరెడ్డి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- పాలనలో సీఎం వైఎస్ జగన్ కొత్త ఒరవడి
- ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు



ప్రియాగార్డెన్స్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సింహాచలం: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వవార్డు అడవివరంలోని ప్రియాగార్డెన్స్, శిడగం వీధి, ఆకులవీధిలో బుధవారం రాత్రి ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని పాలన చేస్తున్నారన్నారు. కులమతాలు చూడకుండా, అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి పాలనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. టీడీపీ పాలనలో పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగిన సందర్భాలు ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. నేడు అధికారులు, ప్రజా ప్రతినిధులే ప్రజల వద్దకు వెళ్లి వాళ్ల బాగోగులు చూసేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

సమస్యలు వింటూ..

ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆకులవీధిలో సీసీ రోడ్డు , డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని నిర్వాసితులు ముత్తంశెట్టిని కోరారు. అలాగే ప్రియాగార్డెన్స్‌లో సామాజిక భవనం నిర్మాణం చేయాలని విన్నవించారు. సింహాచలం దేవస్థానం సమస్యతో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు మరమ్మతులు చేసుకోలేని పరిస్థితి ఉందని శిడగంవీధి నిర్వాసితులు ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్సీ మల్లయ్యనాయుడు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నడింపల్లి రామరాజు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, దొంతల సంతోష్, సిరిపురపు కృష్ణ, మజ్జి ధర్మా, టి.రాము, శిడగం తాతబాబు, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

'పరీక్షా పే' చర్చలో పాల్గొన్న విద్యార్థికి ప్రశంసాపత్రం



సాయికృష్ణను అభినందిస్తున్న వెంకటేశ్వర్లు

మధురవాడ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఆన్‌లైన్‌లో నిర్వహించిన 'పరీక్షా పే' చర్చలో పాల్గొన్న మధురవాడ వెంకటేశ్వర విద్యాపీఠ్ 10వ తరగతి విద్యార్థి నాగసాయి కృష్ణకు బుధవారం ప్రశంసాపత్రం అందింది. ఈ ఏడాది మార్చిలో ఆన్‌లైన్‌లో ప్రధానమంత్రితో నిర్వహించిన చర్చలో సాయికృష్ణ పాల్గొని, ప్రతిభ కనబరచడంతో ఈ ప్రశంసాపత్రం అందింది. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సాయికృష్ణను కరస్పాండెంట్ వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళ ఆత్మహత్య

సింహాచలం: అప్పులబాధతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పెందుర్తి జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో చోటు చేసుకుంది. జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో వాకాడ అప్పలరాజు భార్య భాగ్యలక్ష్మి(42) నివాసం ఉంటున్నారు. అప్పలరాజు జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భాగ్యలక్ష్మి పలుచోట్ల అప్పులు చేయడంతో వారు వచ్చి పదేపదే అడుగుతున్నారు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

బడ్డీల తొలగింపు అడ్డగింత



ఎస్ఐ అప్పారావుతో స్థానికుల వాగ్వాదం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి తాటిచెట్లపాలెం వద్ద బుధవారం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాలివి.. రోడ్డు వెంబడి అనధికారికంగా స్థానికులు బడ్డీలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. అయితే వీరిలో కొందరు మూడు నుంచి నాలుగు బడ్డీలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా, లక్షల్లో వ్యాపారం చేయడంతో స్థానికులు స్పందనలో కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు బడ్డీలను పూర్తిస్థాయిలో తొలగించేందుకు ఆరిలోవ ఎస్ఐ అప్పారావు నేతృత్వంలో అధికారులు బడ్డీలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బడ్డీ యజమానులు తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. ఈ తరుణంలో పోలీసులు, అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. స్థానిక నాయకుల చొరవతో బడ్డీలు తొలగించేందుకు ఒకటి లేక రెండు రోజులు గడువు కావాలని కోరడంతో అధికారులు వెనుదిరిగారు.

హిందీ భవన్‌కు స్థలం కేటాయించండి



జేసీకి వినతి పత్రం అందిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కృష్ణారావు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో భీమిలిలో నిర్మించనున్న హిందీ భవన్‌కు ఎకరం స్థలం కేటాయించాలని కోరుతూ జేసీ విశ్వనాథన్‌కు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎ స్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు వినతిపత్రం అందజేశారు. బుధవారం భీమిలిలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీని కలిసి ఈ మేరకు విన్నవించుకున్నారు.

◆ చిట్టివలస బంతాట మైదానాన్ని స్టేడియంగా అభివృద్ధి చేయాలని కోరుతూ జేసీ విశ్వనాథన్‌కు చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు వినతిపత్రం అందించారు. చిట్టివలసలో సర్వే నంబర్ 35లో 12.30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

బాలికా విద్యపై ప్రచారం



బంగ్లామెట్టపై ప్రచారం నిర్వహిస్తున్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

తగరపువలస: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం జీవీఎంసీ బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బాలికా విద్యపై అవగాహన ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బాల్య వివాహాలపై అవగాహన పెరగాలని ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో బాలురకు దీటుగా బాలికలు దూసుకుపోతున్నారన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

భీమిలి
9493185214

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com